క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కళాశాల్లో ఫిజిక్స్ బోధించేందుకు 50 శాతం మార్కులతో గుర్తింపు కలిగిన యూనివర్శిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులని, ఈ నెల 9 లోగా పూర్తి అర్హత పత్రాలతో కళాశాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక


అంకయ్య


వేసుపోగు మోజెస్

టంగుటూరు: వ్యవసాయ కార్మిక సంఘం టంగుటూరు ఏరియా కమిటీ మహాసభ శుక్రవారం టంగుటూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధి పథకాన్ని మెరుగ్గా అమలు చేయాలని, భూమి పంచాలని తీర్మానం చేశారు. అనంతరం సంఘం నూతన కమిటీని 15 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుడిపూడి అంకయ్య, కార్యదర్శిగా వేసుపోగు మోజెస్ ఉపాధ్యక్షులుగా గడ్డం సాల్మాన్, ఎమ్. యానాది,సహాయ కార్యదర్శిగా టీ. సుబ్బారావు, మరో పది మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకన్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ


ప్రత్యేక అలంకరణలో వరాహాలక్ష్మీనరసింస్వామి

సింగరాయకొండ: ప్రసిద్ధిచెందిన పాతసింగరాయకొండ వరాహాలక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి పవిత్రోత్సవ కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీనరశింహాచార్యులు మాట్లాడుతూ ఈనెల 8వ తేది వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా


అభినవ బుద్ధను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

టంగుటూరు: గత నెలలో జరిగిన 44వ నేషనల్ సబ్ జూనియర్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో మండలంలోని శ్రీ చైతన్య విద్యార్థి తుల్లిబిల్లి అభినవ బుద్ధ సత్తా చాటాడు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వెంకాయమ్మ అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణ, డైరెక్టర్ రాజనరసింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెదిరించారని ఫిర్యాదు

ఉలవపాడు: ఇండోసోలార్ కంపెనీ తరపున మునిశ్వర్‌తో పాటు 20 మంది సర్వే చేస్తుండగా కరేడు గ్రామానికి చెందిన 20 మంది వ్యక్తులు వచ్చి బెదిరించి ఫోన్లు లాక్కున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అంకమ్మ శుక్రవారం కేసు నమోదు చేశారు. 4వ తేదీన కరేడు గ్రామంలోని ఓరుగుంటమ్మ గుడి వద్ద సర్వే చేస్తుండగా కరేడు వ్యక్తులు ఈ బెదిరింపుకు పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదల బియ్యం.. పచ్చనేతల పలహారం

- టీడీపీ నేత రేషన్ షాపులో అక్రమ బియ్యం పట్టుకున్న ప్రజా సంఘాలు
- 235 బస్తాల్లో 139 బస్తాలు పాఠశాలల బియ్యంగా గుర్తింపు
- కనిగిరి నుంచి మూడు దారుల్లో పోర్టులకు రవాణా


రేషన్ షాపు ఇదే..


పట్టుబడిన లారీ ఇదే


బుధవారం రాత్రి టీడీపీ నేత రేషన్ షాపులో నుంచి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ప్రజా సంఘాలు

కనిగిరి రూరల్:

కనిగిరి రేషన్ బియ్యం అక్రమ దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారు. పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష నేతలు రేషన్ అక్రమ తరలింపును అడ్డుకున్నారు. టీడీపీ నేతకు చెందిన రేషన్ దుకాణం నుంచి తరలిస్తున్న సుమారు 235 బస్తాల బియ్యం లారీ ప్రజాసంఘాలు పట్టుకుని అధికారులకు అప్పగించారు. వాటిలో సుమారు 139 బస్తాలు పాఠశాలలకు సంబంధించిన ఎండీఎం సరఫరా బియ్యం కూడా ఉండటం గమనార్హం. ఈ బియ్యం టీడీపీ నేత, ఇటీవల కనిగిరి సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన బాబుదే. అప్పటికే రెండు షాపుల దగ్గర కొంత రేషన్ బియ్యాన్ని తెచ్చుకున్న ఒంగోలు ముఠా గార్లపేట రోడ్డులోని రేషన్ షాపు వద్ద రేషన్ బియ్యం బస్తాలను చీకట్లో ఎత్తుతుండగా ఈ సమాచారం అందుకున్న ప్రజా సంఘాల నేతలు అడ్డుకున్నారు. అక్రమార్కులు బియ్యం లోడుతో ఉన్న లారీని వదిలేసి పరారయ్యారు. మొత్తం 235 బస్తాల్లో 25 కేజీల బస్తాలు 139 ప్రభుత్వం అంగన్‌వాడీలకు, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసినవి కావడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే.. అక్రమార్కులు చివరకు చిన్న పిల్లల బియ్యాన్ని కూడా బొక్కుతున్నారు. నియోజకవర్గంలో దాదాపు డీలర్ల షాపులన్నీ అధికార పార్టీ నేతలవి కావడంతో తెలుగు తమ్ముళ్ల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

నెలకు అరకోటికి పైగా వ్యాపారం..

కనిగిరి నియోజకవర్గం నుంచి ప్రతి నెల అరకోటికి పైగా అక్రమ రేషన్ బియ్యం దందా వ్యాపారం సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని శాఖలకు, నేతలకు నజరానాలు కమీషన్ ఏజెంట్ల జీతాలు పోను అక్రమ వ్యాపారం ముఠాకి నెలకు రూ.20 నుంచి రూ.25లక్షల వరకు మిగులుతుందని ప్రచారంలో ఉంది. ప్రతి నెల ఒక్కో డీలర్ల నుంచి కనీసం 80 నుంచి 100 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతి నెల ఒక్క కనిగిరి మండలం నుంచే సుమారు 4 నుంచి 6 వేల బస్తాలు దాదాపు 12 లారీల్లో ఎగుమతి అవుతుండగా.. మిగతా ఐదు మండలాల నుంచి 12 వేల బస్తాలు రవాణా జరుగుతున్నట్లు అంచనా. కార్డుదారులకు కిలో బియ్యం రూ.10 నుంచి 12 ఇచ్చి డీలర్లు తీసుకుని, వాళ్ల దాన్ని రేషన్ మాఫియాకు కిలో రూ.16 నుంచి రూ.18లకు విక్రయిస్తున్నట్లు సమాచారం

కనిగిరి నుంచి మూడు రూట్లలో తరలింపు..

రేషన్ మాఫిగా కనిగిరి నుంచి బియ్యాన్ని మూడు రూట్లలో ఇతర దేశాలకు పీడీఎస్(రేషన్) బియాన్ని తరలిస్తున్నారు. డీలర్ల దగ్గర నుంచి సేకరించిన బియ్యాన్ని టీడీపీ నేతలు కొందరు నేరుగా బడా వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిసింది. మరికొందరు కావలి, వినుకొండ తదితర ప్రాంతాల్లో రైస్ మిల్లర్స్‌కు రూ.23కు అమ్ముతున్నట్టు తెలిసింది. కనిగిరి నుంచి పీసీపల్లి, వెలిగండ్ల మండలంలో సగం డీలర్ల అక్రమ బియ్యం పీసీపల్లి, కందుకూరు, మీదుగా కావలి మిల్లుకు లేదా... నేరుగా కృష్ణపట్నం పోర్టుకు వెళ్తాయి. పామూరు, సీఎస్‌పురం మండలాలకు చెందిన అక్రమ బియ్యం ఉదయగిరి, నెల్లూరు మీదుగా కృష్ణపట్నం పోర్టుకు చెరుతాయి. వెలిగండ్ల, హనుమంతుని పాడు మండలాల బియ్యం వేములపాడు ఘాట్ రోడ్డు మీదుగా.. వినుకొండ అటునుంచి పోర్టుకు వెళ్తాయి. అయితే దీన్ని కట్టడి చేయాల్సిన అధికారులు ముడుపులు తీసుకుని మిన్నకుండి పోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అన్ని విభాగాల అధికారులకు నెలవారీ మామూళ్లు ఠంచన్‌గా అందుతుండడంతో బియ్యం అక్రమ రవాణాకు అడ్డే లేకుండా పోతోంది.

హామీల అమలుపై నిలదీయండి


బోడవాడలో బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నేతలు

పామూరు: హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి నాయకులను క్షేత్ర స్థాయిలో ప్రజలు నిలదీయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోడవాడలో శుక్రవారం సాయంత్రం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ, రీకాల్ బాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగసాని హుసేన్‌రెడ్డి కూటమి ప్రభుత్వం ప్రజలను చేస్తున్న మోసంపై వివరిస్తూ స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రచార పత్రాలను, క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి, కూటమి నాయకులు సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన అబద్ధపు హామీలు, అమలుచేయని తీరుపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా, ముఖ్యమంత్రిగా జగనన్న లక్ష్యంతోనే నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోఆప్షన్ షేక్ నాయబ్‌రసూల్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరాం శ్రీనివాసులు, బుర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, గోవిందు కొండారెడ్డి, దొడ్డా నాగభూషణం, చెంచయ్య, రమణయ్య, శ్రీనివాసులు, యలమంద, కోటయ్య, చినకోటయ్య, వేణుగోపాల్, నాగేష్, తిరుపతయ్య, బొడ్డు కోటేశ్వరరావు, రామకోటి, యలమందయ్య, దొడ్డా బాలకొటయ్య, నాగరత్తయ్య, పోతినేని లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, పెద్ద నారాయణ, రోశయ్య, ఇగుటూరి రాములు, బాలగోపాల్, దత్తు, బాలకృష్ణ, మొగుళ్లూరు మాల్యాద్రి, వెంకటేశ్వర్లు, బుర్రెడ్డి వేణుగోపాల్, బి.వెంకటేశ్వర్లు, జి.వేణుగోపాల్, బి.గోపాల్‌రెడ్డి, రొడ్డా దాస్, బి.వెంకటేశ్వర్లు, ఆవుల నరసింహ, కోయిలగుంట వీరనారాయణ, పోతినేని నవీన్, బొడ్డు బాలగోపాల్, దండిబోయిన నవీన్, నారాయణ, బసవయ్య, గోవిందు రత్తయ్య, దొడ్డు నరసింహ, పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు


ప్రత్యేక దువాలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ముస్లిం పెద్దలు


పామూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న హిందు, ముస్లింలు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను శుక్రవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక దువా, ప్రార్థనలు, పలు సేవాహిత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రేమ, శాంతి, సహనం, త్యాగం, కరుణా, దయా, సామరస్యత వంటి సన్మార్గాన్ని బోధించిన మహమ్మద్ ప్రవక్త సూచనలు అనుసరణీయం అని మున్సిపల్ చైర్మన్, కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని దేవాంగనగర్‌లోని మదరసా ప్రాంగణంలో శుక్రవారం కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక దువా, ప్రార్థనలు నిర్వహించి, విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ తోటివారికి చేతనైనంతా సహాయం చేయాలనే ప్రవక్త ఉన్నత బోధనలను కొనియాడారు. కార్యక్రమంలో హాఫీజ్ షఫీ, మౌలానాలు, రహీం, ఖాశిం, అబ్దుల్ రహీమాన్, విశ్రాంత ఎంఈఓ మస్తాన్‌వలి, థెరిస్సా సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్‌నాయబ్ రసూల్, మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, న్యాయవాదులు హన్ను, బన్ను, జలీల్, ఖాజా హుస్సేన్, స్థానిక నాయకులు ముకరంజీ, సమ్మద్, పీర్ హుస్సేన్, ఇస్మాయిల్, మస్తాన్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, ఎస్‌కేఆర్ మానసిక వికలాంగుల పాఠశాలలో దివ్యాంగ పిల్లలకు పండ్లు, రొట్టెలు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే అహమ్మద్ బాషా, కమిటీ నాయకులు ఎస్‌కే జంషీర్, షరీఫ్, ఫిరోజ్, నజీముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: మిలాద్ ఉన్ నబీ (మహమ్మద్ ప్రవక్త జన్మదినం) వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మైనారిటీసెల్ పట్టణ అధ్యక్షుడు షేక్.జమీలా నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డితో కలిసి పేదలకు ఆర్థికసాయం చేశారు. మసీదుల్లో, నివాసాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పాలేటి ప్రేమ్‌కుమార్, పిరికిటి వెంకటనారాయణ, పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది


కేబీఆర్ విద్యాసంస్థలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు


కేటీఆర్ టెక్నోస్కూల్ ప్రిన్సిపాల్‌ను సన్మానించి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): ఉపాధ్యాయ దినోత్సవాన్ని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్టన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచరించి చూపిన ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందుతూ ఎందరో మహానుభావులు ఉపాధ్యాయ వృత్తికి పునరంకితమవుతున్నారన్నారు. చిన్నతనం నుంచి విద్య నేర్పి, విజ్ఞానాన్ని అందించి సమాజంపై అవగాహన కల్పించి సమాజంలో పిల్లలను ఉత్తమ పౌరులుగా నిలబెట్టిన ఉపాధ్యాయులను వారు ఎన్నటికీ మరువకూడదన్నారు. అధ్యాపకులును విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని కేటీఆర్ టెక్నో స్కూల్ చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక కేటీఆర్ టెక్నో స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కరస్పాండెంట్ రఘురామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివసత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొండపి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని సహజానంద కరస్పాండెంట్ ఏ. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెట్లూరు సహజనంద హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

టంగుటూరు: మండలంలోని వల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురు పూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కనిగిరిరూరల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు పొందిన హెచ్‌ఎంలు జి. సంజీవి, టి.పెద్దిరెడ్డి, ఎస్‌వీఎల్, విశ్రాంత టీచర్ దిల్షాద్ బేగం, నాగభూషణమ్మ, రమేష్, కోమటిగుంట్ల వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాజా హుస్సేన్, పదిలం బాబులను ఘనంగా సన్మానించారు. ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, మీగడ వెంకటేశ్వర‌రెడ్డి, రాము, ఖాజారంతుల్లా, రవి, ఉమా మహేశ్వరి, నరసింహ, మల్లికార్జునరెడ్డి, రామిరెడ్డి, ఓమాల కొండారెడ్డి, ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా జీవితం ఆదర్శనీయం


థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, సభ్యులు


కనిగిరిరూరల్: మదర్ థెరిస్సా జీవితం పలువురికి ఆదర్శనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కనకపట్నంలోని పరిశుద్ధ ఫాతిమా మాత బాలుర వసతి గృహంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా థెరిస్సా సేవా సమితి, వసతి గృహ అధ్యాపకులు బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ, మొక్కలు నాటడం, తదితర సేవాహిత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సేవా మూర్తి మదర్ థెరిస్సా అని కీర్తించారు. ఫాదర్ హృదయ రాజ్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలన్నారు. తొలుత థెరిస్సా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ఎన్ రసూల్, పసుపులేటి అరుణోదర్, కోఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, బీసీ సంఘ నాయకులు పల్లా మాలకొండయ్య, బొట్టు శ్రీను, పచ్చవ చంద్ర శే ఖర్, ఎల్ఐసీ చెరుకూరి నారాయణ, బాజీ, సమద్, నాగూర్‌బీ, నవకుమార్, రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి: మండలంలోని ముప్పవరం ఫీడర్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ పువ్వాడ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పవరం 11 కేవీ పరిధిలోని గ్రామాలైన వెన్నూరు, చోడవరం, ముప్పవరం గ్రామాల్లో శనివారం మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తామన్నారు. ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహాలకు పొలాలకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.


గురు పూజోత్సవం సందర్భంగా ఒంగోలులో అవార్డులు అందుకుంటున్న ఉపాధ్యాయులు వైవీ సుబ్బారావు, భూలక్ష్మి, జి.వెంకటేశ్వర్లు, జె.భారతి, వ్యాయామ ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్

రేపు మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం మూసివేత


మిట్టపాలెం నారాయణస్వామి విగ్రహమూర్తి

సీఎస్‌పురం(పామూరు): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 8వ తేదీ సోమవారం ఉదయం 5 గంటల వరకు మూసివేస్తున్నట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ శుక్రవారం తెలిపారు. గ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శనం అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఆదివారం జరిపే గోపూజ, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి పల్లకిసేవ, రథోత్సవం, పంచహారతులు మొదలైన కార్యక్రమాలు రద్దు చేసినట్లు తెలిపారు. సంప్రోక్షణ తరువాత 8వ తేదీ సోమవారం ఉదయం 7 గంటల నుంచి భక్తులకు స్వామి దర్శనం ఉంటుందన్నారు.

టంగుటూరు: చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈఓ రమేష్ తెలిపారు. తిరిగి ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతి ఇస్తామన్నారు.